క్లుప్తంగా

పెట్రోల్ బంకు ప్రారంభం



చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామంలో శివ సత్య ఫిల్లింగ్ స్టేషన్‌ను శుక్రవారం నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు, రైతులకు పెట్రోల్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, నాయకులు కారంగుల వాసు, పరసా చెన్నారావు, పల్లె రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన టోఫెల్ పరీక్ష

తిరువూరు: విద్యార్థుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానం పరీక్షించేందుకు నిర్దేశించిన టోఫెల్ పరీక్ష తిరువూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో, 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు జూనియర్స్ స్థాయిలో ఈ పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు 6 వేల మంది ఈ పరీక్షకు హాజరయ్యారని ఎంఈఓ రామకృష్ణ తెలిపారు. రిసోర్స్‌పర్సన్ రాంప్రదీప్, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

కోదండ రామాలయానికి చేరిన భద్రాద్రి తలంబ్రాలు

చాట్రాయి: భద్రాచలం కోదండ రామాలయంలో నవమి వేడుకలకు వినియోగించే తలంబ్రాల బియ్యాన్ని శుక్రవారం మండలంలోని చనుబండ కోదండ రామాలయానికి తరలించారు. గోటితో ఒలిచిన బియ్యాన్ని నవమి వేడుకల్లో భాగంగా సీతారామ కల్యాణం రోజున వినియోగించనున్నారు. ఈ సందర్భంగా తలంబ్రాలకు పూజలు చేసి ఆలయంలో భద్రపరిచారు. కార్యక్రమంలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుకు బుద్ధి చెప్పాలి

నూజివీడు: ఎన్నికల సమయంలోనే ప్రజలు గుర్తుకు వచ్చే చంద్రబాబును రానున్న ఎన్నికల్లో ఓడించి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తనయుడు, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటి నాయన) ఓటర్లను కోరారు. పట్టణంలోని 28వ వార్డులో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రతాప్ అప్పారావును గెలిపించాలని కోరారు.

గాయపడిన వ్యక్తి మృతి

తిరువూరు: స్థానిక రాజుపేటలో గత బుధవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాటేపల్లి కాంతారావు (53) విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. గతంలో తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తూ బదిలీపై అవనిగడ్డ ప్రభుత్వ కళాశాలకు వెళ్లారు. కాంతారావు మృతికి తిరువూరు ప్రభుత్వ కళా శాల అధ్యాపకులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

నారా భువనేశ్వరి పర్యటన

ఎ.కొండూరు: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో శుక్రవారం పర్యటించారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా చంద్రబాబు అరెస్టు సమయంలో మృతిచెందిన కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ అభిమాని గుగులోతు బాబ్లా కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. అండగా ఉంటామంటూ వారికి హామీ పత్రం అందించారు. అనంతరం ఆమె పోలిశెట్టిపాడు గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, ఎమ్మెల్యే అభ్యర్థి కె. శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

సిద్ధార్థ విద్యార్థుల విజయదుందుభి

విస్సన్నపేట: ఇంటర్ ఫలితాల్లో స్థానిక సిద్ధార్థ (డీకేఎస్‌పీ) కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల డైరెక్టర్ మేడా శ్రీహర్ష శుక్రవారం తెలిపారు. సీనియర్ ఎంపీసీ పి. జ్యోతిక 984, కె హనీషా, కె. వాసంతి 983 మార్కులు సాధించారు. జూనియర్ ఎంపీసీ విద్యార్థిని ఎం ప్రవల్లిక, ఇ. భానురేఖ 463, జూనియర్ బైపీసీ ఎన్. మౌనిక, ఎస్. అనూహ్య 431, సీఈసీ విద్యార్థిని ఎ. అంజలి 473 మార్కులు సాధించారని వివరించారు.

శ్రీశ్రీ విద్యార్థుల ప్రతిభ

ఇంటర్ ఫలితాల్లో శ్రీశ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల డైరెక్టర్లు తెలిపారు. సీనియర్ ఎంపీసీలో టి. వివేక్ 985, బైపీసీలో కావటి కీర్తి 976, బి. కేతన 961, సీఈసీ విద్యార్థిని ఎం. ప్రీతి 882, జూనియర్ ఎంపీసీలో కావిటి జ్ఞానకుసుమ, సాధం వైష్ణవి 462, బైపీసీ ఎం. వర్షిత 413, ఎంఈసీలో ఎన్. కిరణ్‌కుమార్ 468, సీఈసీలో పి. రూపనాగలక్ష్మి 426 మార్కులు సాధించారని వివరించారు.

సత్తా చాటిన ఆగిరిపల్లి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

ఆగిరిపల్లి: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ కూరపాటి యోహాను తెలిపారు. మొదటి సంవత్సరం 63 శాతం, ద్వితీయ సంవత్సరంలో 54 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో హరిత్ శ్రీ 1000 మార్కులకు గానూ 857, ప్రథమ సంవత్సరం బైపీసీలో లావణ్య 440 మార్కులకు 422 మార్కులు సాధించారు.

తిరువూరు అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు

తిరువూరు: తిరువూరు పట్టణంలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరు నగర పంచాయతీలోని 16వ వార్డులో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎన్నికల అనంతరం ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని స్వామిదాసు చెప్పారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో రహదారులు, డ్రెయినేజీలు, శివారు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ప్రణాళికలు రూపొందించామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఆర్లపాడు(గంపలగూడెం): ప్రజా సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలన్న మహత్తర ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమల్లోకి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్ సీపీ తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. గంపలగూడెం మండలం ఆర్లపాడులో గురువారం రాత్రి నిర్వహించిన పార్టీ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు రోజుకో రకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీవైపే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. స్థానికుడనైన తనను గెలిపిస్తే ఇక్కడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జెడ్పీటీసీ కోట శామ్యూల్, సర్పంచ్ కూరాకుల త్రివేణి, ఎంపీటీసీ గడ్డం మరియమ్మ, గ్రామ పార్టీ అధ్యక్షుడు దుంపా వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ దుంపా ధనలక్ష్మి, జేసీఎఫ్ మండల కన్వీనర్ విక్కుర్తి నరసింహారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. వినయ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ సర్నారెడ్డి, జి. చెన్నకేశవరెడ్డి, కూరాకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ అధికారులదే కీలకపాత్ర

నూజివీడు: ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకమని, పీఓ, ఏపీఓలు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలని నూజివీడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వై.భవానీ శంకరి అన్నారు. పట్టణంలోని సారథి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం పీఓ, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలింగ్‌కు ఒక్కరోజు ముందు, పోలింగ్ రోజు నిర్వహించాల్సిన విధులు, తీసుకోవాల్సిన చర్యలపై మాస్టర్స్ ట్రైనీల ద్వారా శిక్షణనిచ్చారు. ఆమె మాట్లాడుతూ పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు అన్ని పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాలన్నారు. ఓటరు జాబితాలో పోస్టల్ బ్యాలెట్, దివ్యాంగులు, చనిపోయిన వారి వివరాలు మార్క్ చేసి ఉంటాయని చెప్పారు. ఓటు వేసేందుకు వచ్చే ఓటరు వద్ద మొదటి ప్రాధాన్యతగా ఓటరు గుర్తింపు కార్డులను పరిశీలించాలని వాటితో పాటు 12 రకాల ఇతర ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డులను వినియోగించుకోవచ్చన్నారు. పోలింగ్‌కు ఒకరోజు ముందు పోలింగ్ సామగ్రిని తీసుకున్న తర్వాత పోలింగ్ కేంద్రానికి కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేసుకొని సిద్ధంగా ఉండాలన్నారు. ఓటు వేయడానికి దివ్యాంగులు ఎవరైనా వస్తే వారిని ఇబ్బంది పెట్టకుండా మిగిలిన వారిని ఆపి దివ్యాంగులకు ఓటు వేసే అవకాశాన్ని పీఓ కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో సిబ్బంది అందరూ పారదర్శకంగా పని చేయాలని సూచించారు. ఈవీఎంలలో చార్జింగ్ పూర్తిస్థాయిలో ఉందా? లేదా? వంటివన్నీ మాక్ పోలింగ్ సమయంలో చూసుకోవాలన్నారు. ఈవీఎం ఓటింగ్ తదితర అంశాలపై మరోసారి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు, సూచనల ప్రకారమే విధులు నిర్వహించాలన్నారు. తరగతుల్లో తహసీల్దార్ ఏవీ శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలను దిష్టిబొమ్మలతో పోలుస్తూ టీడీపీ నేత వ్యాఖ్యలు

జి.కొండూరు: రైతులు పంట పొలాల్లో దిష్టి బొమ్మలు కట్టినట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో అక్కడక్కడా బీసీలకు సీట్లు కేటాయించిందని మైలవరం మాజీ ఏఎంసీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు ధనేకుల సాంబశివరావు (బుల్లిబాబు) వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గొల్లపూడిలో ఇటీవల జరిగిన టీడీపీ కార్యక్రమంలో ఓ యూట్యూబ్ చానల్‌తో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సదరు యూట్యూబరు సైతం వైఎస్సార్ సీపీకి వ్యతిరేకంగా రెచ్చగొట్టేలా ప్రశ్నలు సంధించడంతో సాంబశివరావు రెచ్చిపోయి ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. బీసీలతో పాటు ముఖ్యమంత్రిపై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. కుల అహంకారంతోనే సాంబశివరావు ఇటువంటి వ్యాఖ్యలు చేశాడని బీసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యుడైన బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన సర్నాల తిరుపతిరావుకి సీటును కేటాయించడాన్ని జీర్ణించుకోలేని పెత్తందారులు మతి భ్రమించి ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ఓటు అనే ఆయుధంతో ఇటువంటి పెత్తందార్లకు బుద్ధి చెబుతామని బీసీ వర్గాలు సైతం సోషల్ మీడియాలో కౌంటర్ పోస్టులు పెడుతున్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు

అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి

మైలవరం: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మైలవరం నియోజకవర్గ పరిశీలకుడు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మైలవరం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాన్య, పేదవాడికి మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే సీటిస్తే ఓటమి భయంతో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తన సామాజిక వర్గ నాయకులతో సోషల్ మీడియాలో అధారాలు లేని అడ్డగోలు ఆరోపణలు చేస్తూ తిరుపతిరావు వ్యక్తిత్వాన్ని కించపరచేలా మాట్లాడించడం ఆయన అహంకార భావాన్ని తెలియజేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీలో ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను పొగిడిన నోటితోనే పార్టీ మారగానే విమర్శలు చేయడం తగదన్నారు. అభివృద్ధి అనేది నీ చేతుల మీదుగానే జరిగిందని, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి అప్పుడే మర్చిపోయి మాట్లాడటం తగదన్నారు. ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి వసంతకు లేదన్నారు. సమావేశంలో ఎన్. శివశంకరరావు, పాలంకి విజయభాస్కరరెడ్డి, బొంత సాంబశివరావు, పిల్లి రామారావు, మందా జక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

నరసాపురం (విస్సన్నపేట): పాడి రైతులు పశువులకు సకాలంలో ఇన్సూరెన్స్ చేయించుకోవడం మంచిదని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. తిరువూరు క్లస్టర్ పరిధిలోని నరసాపురం, తాతకుంట్ల సొసైటీలను శుక్రవారం ఆయన సందర్శించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నరసాపురంలో మూడవ విడత యూనియన్ బోనస్ రూ.1,25,380,లాభాలు రూ.86 వేలతో పాల క్యానులు పంపిణీ చేశారు. తాతకుంట్లలో రూ.1,31,750 సొసైటీ బోనస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బోర్డు సభ్యులు బొట్టు రామచంద్రరావు, నెక్కళపు వాణిశ్రీ,ట్రస్ట్ బోర్డు సభ్యులు ఎం. విజయలక్ష్మి, పి. సత్యనారాయణ, క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి పాల్గొన్నారు.

రంగాపురం కస్తూర్బాగాంధీ విద్యార్థుల విజయభేరి

రెడ్డిగూడెం: కస్తూర్బాగాంధీ పాఠశాల ద్వితీయ ఇంటర్ విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ఎస్ఓ శ్యామల తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జూనియర్ బైపీసీలో 39 మందికి గాను 37 మంది ఉత్తీర్ణత సాధించగా, సీనియర్ ఇంటర్ బైపీసీలో 30 మందికి గాను 26 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. సీనియర్ బైపీసీలో విద్యార్థిని కొలుసు దివ్యశ్రీ వెయ్యి మార్కులకు గాను 967 మార్కులు, కంభంపాటి షైరేణి వెయ్యి మార్కులకు గాను 936 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు. స్థానిక వికాస్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ ఎస్. నర్సిరెడ్డి తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో ఉల్లం రాధిక వెయ్యి మార్కులకు గాను 965, బొర్రా అఖిల 958 మార్కులు, చిన్నాబు భార్గవి 934 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఉయ్యూరు గాయత్రి 435 మార్కులు, తన్నీరు సాయి శ్రీనివాస్ 429 మార్కులు సాధించారు. మద్దులపర్వ ఏపీ మోడల్ స్కూల్లో ద్వితీయ ఇంటర్‌లో 85 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ వీర్రాజు తెలిపారు. రంగాపురం గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 87 శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు.

ట్రస్ట్ ఏర్పాటు

విస్సన్నపేట: దివ్యాంగులు, వృద్ధులు, అనాథలు, ఒంటరిగా ఉంటున్నవారికి ఆశ్రయం కల్పించేందుకు స్థానిక ఇందిరా నగర్‌లో నూతనంగా రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆదరణ గృహం ఏర్పాటు చేశామని వ్యవస్థాపకుడు వి. నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిసర ప్రాంతాల్లో అలాంటి ఎవరైనా ఉంటే నేరుగా ఆదరణ గృహంలో సంప్రదించాలని కోరారు.

వికాస్ విద్యార్థుల ప్రభంజనం

విస్సన్నపేట: ఇంటర్ ఫలితాల్లో వికాస్ కాలేజీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని వికాస్ విద్యాసంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి శుక్రవారం తెలిపారు. సీనియర్ ఎంపీసీ విద్యార్థిని కడిమెళ్ల గాయత్రి 983 మార్కులు, సీనియర్ బైపీసీ విద్యార్థిని గుంట్రు అంజలి 946, జూనియర్ ఇంటర్ ఎంపీసీ మంకెన నాగ విష్ణు 460, మడిపల్లి అనిల్‌కుమార్, ఎం. వివేకానంద 459 మార్కులు, బైపీసీలో చీపు కావ్య, గంజి పుల్లమ్మ 420 మార్కులు, సీనియర్ ఎంపీసీలో 950 కి పైగా 17 మంది, జూనియర్ ఎంపీసీలో 400కి పైగా 12 మంది, జూనియర్ బైపీసీలో 400 పైగా మార్కులు నలుగురు సాధించారని వివరించారు.

టీడీపీ ఆత్మీయ సమావేశం రసాభాస

వసంత, ఉమా వర్గీయుల పరస్పర దాడులు

జి.కొండూరు: మైలవరం మండలం మొర్సుమల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన టీడీపీ ఆత్మీయ సమావేశం రసాభాసగా మారింది. దేవినేని ఉమా వర్గీయుల నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వసంత వెంకటకృష్ణప్రసాద్‌కి నిరసన సెగ తగిలింది. వసంత వెంకటకృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ ఆత్మీయ సమావేశంలో దేవినేని ఉమా వర్గీయులు ఉమాకి మద్దతుగా నినాదాలు చేశారు. అంతటితో ఆగకుండా పార్టీ మారిన వ్యక్తులను నమ్మేదెలా అంటూ వసంత వెంకటకృష్ణప్రసాద్‌పై పరోక్ష వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆత్మీయ సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి పోటాపోటీగా నినాదాలు చేయడంతో తోపులాట జరిగింది. దీనితో చేసేది లేక నాయకులపై అసహనం వ్యక్తం చేస్తూ వసంత వెంకట కృష్ణప్రసాద్ కార్యక్రమం ప్రారంభంలోనే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

11 మందిపై కేసు నమోదు

మొర్సుమల్లిలో గురువారం రాత్రి జరిగిన టీడీపీ ఆత్మీయ సమావేశం సందర్భంగా టీడీపీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతూ అత్యుత్సాహం ప్రదర్శించడం స్థానికులను అసహనానికి గురిచేసింది. రహదారిపై క్రాకర్స్ కాల్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా వాహనాల రాకపోకలకు అంతరాయం కల్పించారు. దీనితో స్థానికుల అందిన సమాచారంతో పోలీసులు పలువురు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు మైలవరం ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

వాహనాల తనిఖీ

చాట్రాయి: మండలంలోని కృష్ణారావుపాలెం, పర్వతాపురం సరిహద్దు చెక్‌పోస్టులను ఎన్టీఆర్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె. కోటేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో సి.భార్గవ, కిషోర్‌బాబు పాల్గొన్నారు.


తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల హవా

తిరువూరు: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థిని పి. తంబి 1000 మార్కులకు 925 సాధించగా, ఒకేషనల్ విద్యార్థిని బి. విజయలక్ష్మి 971, హెచ్ఈసీ విద్యార్థి వి. సిద్ధు 844, సీఈసీ విద్యార్థిని బి. జయలక్ష్మి 847 మార్కులతో ఆయా గ్రూపుల్లో ప్రథమస్థానం సాధించారు. ఈ కళాశాలలో జనరల్ గ్రూపుల్లో 50 శాతం, ఒకేషనల్ గ్రూపుల్లో 60 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ లక్ష్మి తెలిపారు. తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు 33 మంది ప్రథమ సంవత్సరం ఇంటర్ పరీక్షకు హాజరుకాగా ఏడుగురు ఉత్తీర్ణులయ్యారు. శ్రీనిధి జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సర ఎంపీసీ విద్యార్థి అజ్మీర కార్తీక్ 470 మార్కులకు 463, బైపీసీలో మరింగంటి లక్ష్మీ సాయిశ్రీ 440 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. నాగార్జున జూనియర్ కళాశాలలో ద్వితీయ ఎంపీసీ గ్రూపులో గాదె పావని 1000 మార్కులకు 984, వేమిరెడ్డి సింధు 983, బైపీసీలో శ్రావణి 983, సీఈసీలో మారేటి నవ్యశ్రీ 950 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ శేషగిరిరావు తెలిపారు.

విశ్వేశ్వరయ్యకు నివాళి

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు. ప్రస్తుత ఇంజినీర్లకు ఆయన ఆదర్శం అని తెలిపారు. ఎలిమెంటరీ పాఠశాల హెచ్ఎం ఎ. వెంకట నరసింహారావు, పలువురు విద్యార్థులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు నాణ్యమైన సిమెంటు వాడాలి



కొండపల్లిలో భారతి సిమెంట్ డీలర్‌కు రూ.లక్ష బీమా చెక్కు అందజేసిన కల్యాణ చక్రవర్తి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): భవన నిర్మాణాలకు సాంకేతిక పరిజ్ఞానంతో తయా రు చేసిన నాణ్యమైన సిమెంటును ఎంచుకోవాలని భారతి సిమెంటు అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) కల్యాణ చక్రవర్తి, సీనియర్ టెక్నికల్ అధికారి ఎస్.భవానీశంకర్ అన్నారు. కొండపల్లిలో శ్రీనివాస సిమెంట్, స్టీల్ డీలర్ కిషోర్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ భారతి సిమెంట్ అధునాతన పరిజ్ఞానంతో తయారవుతుందన్నారు. సిమెంట్ తయారీకి నాణ్యమైన ముడిపదార్థాలు ఎంచుకుంటుందన్నారు. శ్లాబు వేసిన వారం రోజుల అనంతరం కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యత పరీక్షలు చేసి భవన నిర్మాణ మేస్త్రీలు, యజమానులకు వివరిస్తారన్నారు. మేస్త్రీల సందేహాలు నివృత్తి చేశారు. మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున బీమా సదుపాయం కల్పించిన బాండ్లు అందజేశారు.

జగన్ పాలనలోనే పేదల అభ్యున్నతి

మేకా ప్రతాప్ అప్పారావు



జనార్థనవరంలో ప్రచారం చేస్తున్న ప్రతాప్ అప్పారావు

చాట్రాయి: రాష్ట్రంలోని పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపొందాలని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. గురువారం మండలంలోని ఆరుగొలనుపేట, జనార్థనవరం గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. చంద్రబాబు పాలనలో పేదలకు ఒక్కరికి కూడా న్యాయం జరగలేదని విమర్శించారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పామర్తి ఝాన్సీ, పుచ్చకాయల అప్పిరెడ్డి, ఎంపీటీసీ పోతురెడ్డిపల్లి కృష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా.. ఆదరించండి

సర్నాల తిరుపతిరావు



మైలవరంలో ప్రచారం చేస్తున్న సర్నాల తిరుపతిరావు

మైలవరం: స్థానికుడిని, అందరికీ సుపరిచితుడనైన తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, అందరూ ఆదరించి తనను గెలిపించాలని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు విజ్ఞప్తి చేశారు. మైలవరం ఒకటో వార్డులో శుక్రవారం ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని తిరుపతిరావు ప్రారంభించారు. స్థానిక వినాయకుని గుడిలో ముందుగా పూజలు నిర్వహించారు. మైలవరం ఒకటో వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రిగా మరో సారి వైఎస్ జగన్‌ను అధికారంలోకి తీసుకురావాలని, అప్పుడే రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి జరుగుతుందని వివరించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతిరావు గెలుపునకు ఐక్యంగా కృషి

గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ



మాట్లాడుతున్న గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ

మైలవరం: సామాన్యుడు, అందరివాడు అయిన వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావును అధిక మెజారిటీతో గెలిపించాలని గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ అన్నారు. మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన బీసీ ఆత్మీయ మహాసభలో ఆయన మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడేవాడు, స్థానికుడు అయిన సర్నాల తిరుపతిరావును గెలిపించుకోవడం వలన నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాన్యుడైన తిరుపతిరావుకు సీటిస్తే ఓటమి భయంతో తన సామాజికవర్గ నాయకులతో సోషల్ మీడియాలో అడ్డగోలుగా తిరుపతిరావు వ్యక్తిత్వాన్ని కించపరచే విధంగా పోస్టులు పెట్టిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వైఖరిని బీసీలు గమనించాలన్నారు. కుల అహంకారంతో పెత్తందారీ పోకడలు పోతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను, ఆయన కులాన్ని దూషించేలా ఎమ్మెల్యే అనుచరులు వ్యవహరిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది స్థానికేతరలు మైలవరంలో పోటీ చేసి గెలిచి తరువాత ఐదేళ్లు కాలక్షేపం చేశారని విమర్శించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్థానికుడు తిరుపతిరావుకు అవకాశం కల్పించారని, ఆయనను గెలిపించి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామన్నారు. అభ్యర్థి తిరుపతిరావు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. వైఎస్సార్ సీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ప్రతిపక్షం వారు తనపైన నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే కళ్లులేని కబోదుల్లా ప్రతిపక్ష నాయకులు అసలు అభివృద్ధే జరగలేదని చెప్పడం వారికే చెల్లిందన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఎమ్మెల్యేగా ఉండి ఎన్నో ప్రారంభోత్సవ కార్యక్రమాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్న వసంత వెంకట కృష్ణప్రసాద్ పార్టీ మారగానే అసలు అభివృద్ధే జరగలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన అభివృద్ధిని వివరించారు. బీసీ సంఘం రాష్ట్ర నాయకులు శివశంకరరావు, రెడ్డిగూడెం జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, పిల్లి రామారావు, మందా జక్రధరరావు, బొంత సాంబశివరావు, మైలవరం ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

గంపలగూడెం: గంపలగూడెం మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న 84 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. పెను గొలను–2లో ఏడుగురు, అనుముల్లంకకు చెందిన ఎనిమిదిమంది, దుందిరాలపాడుకు చెందిన 14 మంది, కనుమూరుకు చెందిన 15 మంది, గంపలగూడెం –2కు చెందిన 9 మంది, గాదెవారి గూడెంకు చెందిన ఆరుగురు, వినగడపకు చెందిన 10 మంది, గోసవీడుకు చెందిన 15 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ సబితకు అందజేశారు.

- జి.కొండూరు: మండల పరిధిలోని చెర్వుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, కవులూరు, ముత్యాలంపాడు గ్రామాలకు చెందిన 49 మంది గ్రామ వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ఈ మేరకు వారి రాజీనామా పత్రాలను స్థానిక ఎంపీడీఓ శ్రీనివాసరావుకు అందజేశారు. వారు మాట్లాడుతూ తాము స్వచ్ఛందంగా ప్రజలకు అందిస్తున్న సేవలను కించపరుస్తూ తెలుగుదేశం నాయకులు చేసిన వ్యాఖ్యలు తమను బాధించాయన్నారు.
- మైలవరం: మైలవరం మండలం చంద్రగూడెం, పుల్లూరు, కీర్తిరాయునిగూడెం, గణపవరం గ్రామాలకు చెందిన 50 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి. శ్రీనివాస్‌కు శుక్రవారం అందజేశారు.
- విస్సన్నపేట: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామ వలంటీర్లు 107 మంది స్వచ్ఛందంగా శుక్రవారం రాజీనామా చేశారు. పుట్రేల, వేమిరెడ్డిపల్లి, తెల్లదేవరపల్లి, కలగర, తాతకుంట్ల, చంద్రుపట్ల గ్రామాలకు చెందిన వలంటీర్లు విస్సన్నపేట మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ విజయకుమారికి అందజేశారు.

వీవీఆర్ ప్రభుత్వ కళాశాల ఉత్తమ ఫలితాలు

మైలవరం: ఇంటర్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సొంగా సరళకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం 53 శాతం, ద్వితీయ సంవత్సరం 60 శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రథమ సంవత్సరం సీఈసీ గ్రూపు విద్యార్థి ఎం. పావని 472 మార్కులు, ఎంపీసీ జి. హరీష్ 420 మార్కులు, ఒకేషనల్ ఓఏఎస్ తాళ్లూరి సాయిరాణి 477 మార్కులు సాధించి కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో బి. వాసవి 923 మార్కులు, సీఈసీలో ఎన్. హవిల 923, సెకండ్ ఇయర్ ఓఏఎస్ గ్రూపునకు చెందిన బి. నాగరాజు 679 మార్కులు సాధించారన్నారు.

ప్రకటన

[illegible]

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తిరువూరు డివిజన్

99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)

Office mail : sakshiads@gmail.com